13-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీ ఆత్మిక యోగము సదా పవిత్రంగా అవ్వడం కోసము ఎందుకంటే మీరు పవిత్రతా సాగరునితో యోగాన్ని జోడిస్తారు, పవిత్ర ప్రపంచాన్ని స్థాపన చేస్తారు"

ప్రశ్న:- నిశ్చయబుద్ధి కల పిల్లలకు మొట్టమొదట ఏ నిశ్చయము దృఢంగా ఉండాలి? ఆ నిశ్చయానికి గుర్తు ఏమిటి?

జవాబు:- మేము ఒక్క తండ్రి పిల్లలము, తండ్రి నుండి మాకు దైవీ స్వరాజ్యం లభిస్తుంది అని మొట్టమొదట దృఢమైన నిశ్చయం ఉండాలి. నిశ్చయం ఏర్పడినట్లయితే వెంటనే ఏమని బుద్ధిలోకి వస్తుందంటే - మేము ఏ భక్తినైతే చేసామో, అది ఇప్పుడు పూర్తయింది, ఇప్పుడు స్వయంగా భగవంతుడు మాకు లభించారు అని. నిశ్చయబుద్ధి కల పిల్లలే వారసులుగా అవుతారు.

పాట:- ఓ దూరదేశపు బాటసారి... (ఓ దూర్ కే ముసాఫిర్...)

ఓం శాంతి. అందరూ దూరదేశపు బాటసారులేనని తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు. ఆత్మలందరూ అత్యంత దూరంలోనున్న పరంధామ నివాసులు. ఇది కూడా శాస్త్రాలలో ఉంది. ఆత్మ దూరంలో ఉంటుంది, అక్కడ సూర్యచంద్రాదుల ప్రకాశం ఉండదు. మూలవతనం మరియు సూక్ష్మవతనంలో ఎలాంటి డ్రామా ఉండదు. డ్రామా ఈ స్థూలవతనంలో ఉంటుంది, దీనినే మనుష్య సృష్టి అని అంటారు. మూలవతనం మరియు సూక్ష్మవతనంలో 84 జన్మల చక్రము ఉండదు. చక్రాన్ని మనుష్య సృష్టిలో చూపించడం జరుగుతుంది. మనుష్య సృష్టి ఏమిటి, మనిషి దేనితో తయారుచేయబడ్డాడు? మనిషిలో ఒకటేమో ఆత్మ ఉంటుంది, ఇంకొకటి శరీరము ఉంటుంది. పంచ తత్వాలతో కూడిన బొమ్మ తయారవుతుంది, అందులోకి ఆత్మ ప్రవేశించి పాత్రను అభినయిస్తుంది. కావున అందరూ దూరదేశ వాసులే. కానీ మీరు నిశ్చయం ఏర్పరచుకున్నారు. మనుష్యులలో నిశ్చయం లేదు. నన్ను దూరదేశ నివాసి అని అంటారు, కానీ ఆత్మలైన మీ అందరి నివాస స్థానము ఒక్కటే. ఆ నాటకంలో ఎవరైతే పాత్రను అభినయిస్తారో, అందులో ప్రతి ఒక్కరికీ తమ-తమ ఇల్లు ఉంటుంది కదా. అక్కడి నుండి వచ్చి పాత్రను అభినయిస్తారు. మేమంతా ఒక్క తండ్రి పిల్లలమే, ఒకే ఇల్లు అయిన పరంధామ నివాసులము అని ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేసుకుంటారు. అది బ్రహ్మ మహతత్వము, ఇది ఆకాశ తత్వము. ఇక్కడ పాత్రను అభినయిస్తారు, రాత్రి-పగలు ఉంటాయి అందుకే సూర్యచంద్రాదులు కూడా ఉన్నారు. మూలవతనంలో రాత్రి-పగలు ఉండవు. ఈ సూర్యచంద్రాదులు దేవతలేమీ కారు, ఇవి రంగస్థలాన్ని ప్రకాశవంతం చేసే దీపాలు. పగలు సూర్యుడు ప్రకాశాన్ని ఇస్తాడు, రాత్రివేళ చంద్రుని ప్రకాశము ఉంటుంది. ఇప్పుడు మనుష్యులందరూ ముక్తిధామంలోకి వెళ్ళాలని కోరుకుంటారు. భగవంతుడు పైన ఉంటారని వారికి తెలుసు. ఓ పరమపిత పరమాత్మ అని భగవంతుడిని కూడా తలచుకుంటారు, అప్పుడు బుద్ధి పైకి వెళ్ళిపోతుంది. ఆత్మ అర్థం చేసుకుంటుంది కానీ అజ్ఞానపు నీడ కమ్ముకుని ఉంది. మేము ఇక్కడి నివాసులము కాము, మన తండ్రి వారు అన్నది కూడా తెలుసు. నోటి నుండి 'ఓ గాడ్ ఫాదర్' అని కూడా అంటారు. మళ్ళీ అందరూ తండ్రులే, భగవంతుడు సర్వవ్యాపి అని అనేస్తారు. అందరూ తండ్రులు కారని పిల్లలకు అర్థం చేయించడం జరిగింది. ఆత్మలందరూ పరస్పరం సోదరులు. ఇది తెలియని కారణంగా కొట్లాడుకుంటూ-గొడవపడుతూ ఉంటారు. ఆత్మలైన మీరు సోదరులు, ఒక్క తండ్రి సంతానంగా అయ్యారు. నిశ్చయబుద్ధి కలవారు కూడా నంబరువారుగా ఉన్నారు. తండ్రి నుండి వారసత్వాన్ని పొందాలి అని లౌకిక సంబంధంలో నిశ్చయము ఉండనే ఉంటుంది. ఇక్కడ తండ్రి నుండి మాయ పదే-పదే ముఖం తిప్పేస్తుంది. సర్వశక్తివంతుడైన తండ్రికి చెందినవారిగా అవుతారు, కావున మాయ కూడా సర్వ శక్తివంతంగా అయి గొడవపడుతుంది. ఇది పంచ వికారాలపై విజయం పొందడానికి యుద్ధము. యుద్ధమైతే ప్రసిద్ధమైనది. ఇకపోతే శాస్త్రాలలో కౌరవులు-పాండవులను ఎలాగైతే చూపించారో, అటువంటి విషయమేమీ లేదు. ఈ రావణునితో యుద్ధము చాలా శక్తివంతమైనది. తండ్రి స్మృతిలో ఉంటూ మనం సంపూర్ణంగా అవ్వాలని, ఆత్మ పవిత్రంగా అవ్వాలని మనం కోరుకుంటాము. యోగము తప్ప ఇంకే మార్గమూ లేదు. ఇతర యోగాలేవైతే నేర్చుకుంటారో, అవేమీ పవిత్రత కోసము కావు. అవన్నీ అల్పకాలికం కోసము స్థూలమైన యోగాలు మరియు ఇది సదా పవిత్రంగా అవ్వడం కోసము ఆత్మిక యోగము. పవిత్రతా సాగరునితో మనము యోగాన్ని జోడించడం ద్వారా పవిత్రంగా అవుతాము. తండ్రి అంటారు - ఈ యోగాగ్ని ద్వారా మీ జన్మజన్మాంతరాల పాపాలు భస్మమవుతాయి. ఇది పతిత ప్రపంచము అని బుద్ధి కూడా చెప్తుంది. ఇది సత్యయుగమా లేక కలియుగమా అని ఎవరినైనా అడగండి, దీనిని సత్యయుగము అని ఎవరూ అనరు.

సత్యయుగము కొత్త ప్రపంచము. దానిని స్వర్ణిమ యుగమని, దీనిని ఇనుప యుగమని అంటారు. పాత ప్రపంచాన్ని కలియుగమని మరియు కొత్త ప్రపంచాన్ని సత్యయుగమని అంటారు. ఇప్పుడు ఇది సత్యయుగముగా ఉంది, అలాగే కలియుగముగా కూడా ఉంది అని ఎవరూ అనలేరు. అలా కాదు. నరకవాసులు అంటేనే నరకవాసులు. పాత ప్రపంచాన్ని పతిత ప్రపంచమని, కొత్త ప్రపంచాన్ని పావన ప్రపంచమని అంటారు. ఈ విషయాలు మనుష్యులకే అర్థం చేయించడం జరుగుతుంది, జంతువులు - పతితపావనా రండి అని ఏమైనా అంటాయా. ఎవరిని అడిగినా ఇది నరకము అనే అంటారు. భారత్ యే కొత్త ప్రపంచముగా, స్వర్గంగా ఉండేది, భారత్ యే పాత ప్రపంచముగా, నరకంగా ఉంది. ఎక్కువగా మీరు భారత్ గురించే చెప్తూ ఉండండి. మిగిలినవారంతా మధ్యలో వస్తారు. వారితో మనకు సంబంధం లేదు. మన ధర్మమే వేరు, అది ఇప్పుడు కనుమరుగైపోయింది.

ఇప్పుడు మీరు నిశ్చయబుద్ధి కలవారిగా అయ్యారు. మీకు తెలుసు - మనము ఒకే తండ్రి పిల్లలము. తండ్రి నుండి మనకు స్వరాజ్యం లభిస్తుంది. మొదట ఈ దృఢమైన నిశ్చయం ఉండాలి. జ్ఞానము వింటారు, అది బాగానే ఉంది. ప్రజలుగా అవుతారు. ఇకపోతే మేము అనంతమైన తండ్రి పిల్లలము అన్న నిశ్చయము ఏర్పడాలి, తద్వారా మేము భగవంతుడిని కలుసుకునేందుకు భక్తి చేసాము అన్నది అర్థమవుతుంది. ఇప్పుడు భక్తి పూర్తయ్యింది. ఇప్పుడు భగవంతుడు స్వయంగా వచ్చి కలుసుకున్నారు. వారి నుండి సూర్యవంశీ స్వరాజ్య పదవి లభిస్తుంది. మనం అంతటి ఉన్నతమైన పదవిని పొందుతాము. ఏ విధంగా షావుకారులు పిల్లలను దత్తత తీసుకుంటారు కదా. వారైతే ఒక్క బిడ్డను దత్తత తీసుకుంటారు. ఇక్కడైతే అనంతమైన తండ్రికి అనేకమంది పిల్లలు కావాలి. వారంటారు - ఎవరైతే నా బిడ్డగా అవుతారో, వారికి స్వర్గ వారసత్వం లభిస్తుంది, ఎవరైతే నాకు చెందినవారిగా అవ్వరో, వారు వారసత్వాన్ని తీసుకోలేరు. వారు శ్రీమతంపైనే నడవరు. ఎవరికైతే నిశ్చయం ఏర్పడుతుందో, వారంటారు - బాబా, మీరు మళ్ళీ వచ్చారు, చాలు, ఇక మేము మీ చేతిని వదలము. తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు, పిల్లలు మళ్ళీ ఇతరులకు అర్థం చేయిస్తారు - మేము పారలౌకిక తండ్రికి పిల్లలుగా అయ్యాము, వారి శ్రీమతంపై మేము నడుస్తున్నాము, మమ్మల్ని పరమపిత పరమాత్మ చదివిస్తున్నారు అని. ఇంతమంది బి.కె.లుగా అయ్యారంటే తప్పకుండా నిశ్చయముంది, మరి మేము కూడా ఎందుకు అవ్వకూడదు? మేము మీవారిగా అయ్యాము అని వ్రాసి పంపించాలి. తండ్రి అంటారు - నేను దూరంగా ఏమైనా ఉన్నానా, నేనైతే ఇక్కడే కూర్చుని ఉన్నాను, హాజరై ఉన్నాను, ఇక్కడ ప్రాక్టికల్ గా కూర్చున్నాను. ఏ విధంగా ప్రెసిడెంట్ గురించి - వారు ఈ సృష్టిపై హాజరై ఉన్నారు అని అంటారు, అంటే దాని అర్థము అతను సర్వవ్యాపి అని కాదు. అలాగే పరమపిత పరమాత్మ, ఎవరినైతే దుఃఖహర్త-సుఖకర్త అని అనడం జరుగుతుందో, వారు సర్వవ్యాపి కాలేరు. వారు ఉపస్థితులై ఉన్నప్పుడు మనుష్యులు అంత దుఃఖితులుగా ఎలా అవ్వగలరు? ఆ మాటకొస్తే తండ్రి ఉపస్థితులై లేనప్పుడు (స్వర్గంలో) కూడా ఎవ్వరూ దుఃఖితులుగా ఉండరు.

తండ్రి పిల్లల కొరకు గూడును నిర్మించారు. ఏ విధంగా పిచ్చుక తన పిల్లల కొరకు గూడును నిర్మిస్తుందో, అదే విధంగా తండ్రి కూడా మీ కొరకు మీ ద్వారానే గూడును నిర్మించేలా చేస్తారు. మీరు ఉండడానికే స్వర్గమనే గూడు తయారవుతుంది. తండ్రి అంటారు - మీరు నా మతంపై నడిచినట్లయితే స్వర్గంలో రాజ్యం చేస్తారు. ఒకవేళ పూర్తి నిశ్చయం ఉన్నట్లయితే గట్టిగా పట్టుకోవాలి. అలాగని ఇక్కడ కూర్చుండిపోవడం కాదు. ఇళ్ళు-వాకిళ్ళను వదలకూడదు. వారైతే ఇళ్ళు-వాకిళ్ళను వదిలేస్తారు. గురువును భగవంతునిగా భావిస్తారు. వారేమీ జీవిస్తూ మరణించరు. మీరైతే జీవిస్తూ మరణించి మళ్ళీ సత్యయుగంలో జీవించాలి. మీరు తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటారు. అనంతమైన తండ్రి చదివిస్తున్నారు, 21 జన్మల వారసత్వాన్ని ఇస్తున్నారు అన్న నిశ్చయం ఉన్నప్పుడు మరి వారి శ్రీమతంపై నడవాల్సి ఉంటుంది. పిల్లలుగా అయితే తండ్రి డైరెక్షన్లు ఇస్తారు. మొదట ఒక వారం రోజులు భట్టీలో కూర్చోండి. మీకు రోజూ జ్ఞానం లభిస్తూ ఉంటుంది. అందరూ అయితే ఒకేలా అర్థం చేసుకోరు, ప్రతి ఒక్కరూ తమ పురుషార్థము మరియు భాగ్యము అనుసారంగా పొందుతారు. అంతా పురుషార్థము మరియు భాగ్యముపైనే ఆధారపడి ఉంటుంది. భాగ్యంలో ఏముంది, ఏ పదవిని పొందుతారు అన్నది తెలిసిపోతుంది. తండ్రికి చెందినవారిగా అయి మళ్ళీ గృహస్థ వ్యవహారంలో కూడా ఉండాలి. అచ్చా, గృహస్థ వ్యవహారంలో లేకపోతే వెళ్ళి అంధులకు చేతి కర్రగా అవ్వండి. సత్య నారాయణుని కథను వినిపించేందుకు తప్పకుండా వెళ్ళాలి.

చూడండి, ప్రేమ్ బచ్చీ (ప్రేమ్ అక్కయ్య) సేవ చేయడానికి వెళ్ళారు. ఎవరైతే ఆహ్వానమును ఇచ్చారో, వారు ఘన స్వాగతం పలికారు, అనేకులతో కలిపించారు, అక్కడివారు ప్రభావితులయ్యారు. కానీ బాబా అంటారు - వీరిని అనంతమైన తండ్రి చదివిస్తున్నారు, వారి ద్వారా 21 జన్మల వారసత్వం లభిస్తుంది అన్న నిశ్చయబుద్ధి కలవారు

ఒక్కరు కూడా లేరు. ప్రభావితులవుతారు కానీ తప్పకుండా జ్ఞానసాగరుడైన తండ్రే చదివిస్తున్నారు అన్న నిశ్చయం ఏమైనా ఏర్పడుతుందా. అయితే, చాలా బాగుంది అని మాత్రమే అంటారు. బయటకు వెళ్ళగానే ఇక సమాప్తమైపోతుంది. ఎవరో అరుదుగా పురుషార్థం చేస్తారు. పరస్పరం సత్సంగాలు జరుపుతారు, కానీ ఎవరైతే జరుపుతారో వారు కూడా నిశ్చయబుద్ధి కలవారిగా లేరు. వారిని హాఫ్ కాస్ట్ అని అంటారు. నిశ్చయము మరియు సంశయము ఉంటుంది. అప్పుడే తండ్రే చదివిస్తున్నారు అని అంటారు, మళ్ళీ అప్పుడే - ఇది ఎలా జరగగలదు అని అడుగుతారు. అవును, పవిత్రంగా అవ్వడము మంచిదే కానీ పవిత్రంగా ఉండడం చాలా కష్టము. మొదటైతే నిశ్చయం కావాలి. ఎంతగానో పులకరిస్తూ వ్రాయాలి. ఏ విధంగా బంధనంలో ఉన్న గోపికలు ఉత్తరాలు వ్రాస్తారో, అలా బంధనం లేనివారు ఎప్పుడూ వ్రాయరు. బాబా ఏమని వ్రాస్తారంటే - ఒక్కరిని కూడా నిశ్చయబుద్ధి కలవారిగా చేయలేదు. అయితే, సాధారణ ప్రజలను తయారుచేసారు, వారసులను తయారుచేయలేదు. ఒక్కరు కూడా నిశ్చయబుద్ధి కలవారిగా అవ్వలేదు. నిశ్చయబుద్ధి కలవారే వారసులుగా అవుతారు. కొందరు నిశ్చయబుద్ధి కలవారిగా ఉన్నారు కానీ జ్ఞానాన్ని తీసుకోకపోతే, అదే వంశంలోకి వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు. ముందుముందు ఖచ్చితమైన సాక్షాత్కారాలు జరుగుతాయి. తాము ఏ నంబరులో దాస-దాసీలుగా అవుతారు అన్నది కూడా తెలిసిపోతుంది. అప్పుడిక చాలా పశ్చాత్తాపపడతారు. మేమైతే శ్రీమతంపై నడవలేదు, అందుకే ఈ పరిస్థితి ఏర్పడింది. అయినా ప్రతి పరిస్థితిలోనూ డ్రామా అనే అంటారు. వీరికి డ్రామాలో కల్పకల్పాంతరాలు ఇటువంటి పాత్రయే ఉంది. సాక్షాత్కారాలైతే జరగవలసిందే. చివరిలో రిజల్టు వెలువడనున్నది. అప్పుడిక విధి, మా భాగ్యంలో ఇదే ఉంది అని అంటారు. మీ చదువు యొక్క రిజల్టు వెలువడుతుంది. ఇది చాలా గొప్ప స్కూలు. చదివించేవారు ఒక్కరే ఉన్నారు, చదువు ఒక్కటే ఉంది, కూడా ఒక్కటే ఉంది. ఈ విద్యార్థి ఎటువంటివారు అన్నది టీచర్ కు తెలుస్తుంది, అందరూ వేగంగా ముందుకు వెళ్తూ ఉంటారు. ముందుముందు ఇంకా ఎన్నో తెలుస్తాయి. ఏ విధంగా ప్రారంభంలో ధ్యానంలోకి వెళ్ళేవారో, అలా ఘడియ-ఘడియ మీరు ధ్యానంలోకి వెళ్తారు. మీరు కూడా అర్థం చేసుకుంటూ ఉంటారు, తండ్రి కూడా అర్థం చేయిస్తూ ఉంటారు. మీరు పొరపాట్లు చేస్తున్నారు, శ్రీమతంపై నడవడం లేదు. అలా నడుస్తూ-నడుస్తూ అది అలవాటైపోతుంది. శివబాబా, మేము మీ శ్రీమతంపై నడుస్తున్నామా అని మీరు అడగండి. బాబా చెప్తారు - మీరు నడవడం లేదు కావుననే మీ భాగ్యం ఇలా కనిపిస్తుంది అని. ఇప్పుడు దశ బాలేదు, ముందుముందు తెరుచుకోవచ్చు అని భావించడం జరుగుతుంది. కొందరు కామము యొక్క తేలికపాటి నషాలో పడిపోతారు. భారత్ పావనంగా ఉండేది, శ్రేష్ఠాచారిగా ఉండేది, అది ఇప్పుడు భ్రష్టాచారిగా ఉంది. ఆ శ్రేష్ఠమైన దేవతల మహిమ అయితే ఉంది కదా. తండ్రి అంటారు - ఇది అసురీ సంప్రదాయము, నేను దైవీ సాంప్రదాయాన్ని స్థాపన చేయడానికి వచ్చాను. ఈ దేవీ-దేవతా ధర్మం ఉన్నతోన్నతమైనది. తండ్రి మాత్రమే పతితపావనుడు. కానీ మనుష్యులు ఏమీ అర్థం చేసుకోరు. ఎవరెవరైతే ధర్మ స్థాపన చేయడానికి వస్తారో, వారు తప్పకుండా పవిత్రంగా అవుతారు. ప్రతి ఒక్క విషయంలో మంచి మరియు చెడు ఉంటాయి. తక్కువ భాగ్యము మరియు మంచి భాగ్యము కలవారు ఉన్నారు. ఇప్పుడు ఈ రావణ రాజ్యం అంతమవ్వనున్నది. ఈ రావణ నగరానికి నిప్పు అంటుకోనున్నది. రాముని సైన్యమైన మీరు కూర్చొని ఉన్నారు. ఈ ధర్మానికి చెందినవారు ఎవరైతే ఉంటారో, వారు అర్థం చేసుకుంటూ ఉంటారు. నంబరువారుగా అర్థం చేసుకుంటారు. కొందరికి జనకుని వలె ఒక్క బాణం తగలడంతో సరెండర్ అయిపోతారు. వారు ఎలాంటి సాకులు చెప్పరు. ఇక్కడ సాకులు నడవవు. కానీ మాయా తుఫానులు కూడా ఎన్నో వస్తాయి. తాము ఈశ్వరీయ సంతానము అని తమ వంశాన్నే మరపింపజేస్తుంది. కావున, పిల్లలు చాలా మధురంగా అవ్వాలి. కామము యొక్క నషా కొద్దిగా కూడా ఉండకూడదు. కామము పెద్ద మహాశత్రువు. ఇది అన్నింటికన్నా అత్యంత పెద్ద పరీక్ష. బాబా అంటారు - పిల్లలూ, కలిసి ఉంటూ పవిత్రంగా అయి చూపించండి. తండ్రికి పిల్లల అవస్థ గురించి తెలుసు. నిశ్చయబుద్ధి కలవారు తండ్రికి తమ సమాచారాన్ని ఇస్తారు - బాబా, నేను మిమ్మల్ని స్మృతి చేస్తాను, మీ ఈ సేవను చేస్తున్నాను. సేవా సమాచారము వ్రాసినప్పుడే నేను విశ్వాసం ఉంచగలను. సేవకు ఋజువును చూపించినప్పుడే - వీరిలో మంచి ఆశ కనిపిస్తుందని బాబా అర్థం చేసుకోగలుగుతారు. బాబా ఒక్కరే, పిల్లలైన మనము అనేకమంది ఉన్నాము అన్నది కూడా అర్థం చేసుకోవాలి. బాబాకు ప్రతి రోజూ రెస్పాన్స్ ఇవ్వవలసి ఉంటుందని కాదు. అలా కాదు, తండ్రి పేదల పెన్నిధి. పేదవారికే దానమివ్వడం జరుగుతుంది. ఈ భారత ఖండము నిరుపేదగా ఉంది. భారత్ యే షావుకారి నుండి నిరుపేదగా అయ్యింది. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఈ భారత్ యే అవినాశీ ఖండము, ఇక్కడే భగవంతుడు అవతరిస్తారు. భారత్ బంగారు పిచ్చుకలా ఉండేది అనగా సర్వ సుఖాల భాండాగారంగా ఉండేది. ఆ సుఖధామంలోకి వెళ్ళేందుకు మనమందరమూ పురుషార్థం చేస్తున్నాము. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ రకమైన సాకులు చెప్పకుండా తండ్రి శ్రీమతంపై నడుస్తూ ఉండాలి. సేవకు ఋజువును ఇవ్వాలి.

2. మనం ఈశ్వరీయ సంతానము, మనది ఉన్నతోన్నతమైన వంశము, ఇది మర్చిపోకూడదు. నిశ్చయబుద్ధి కలవారిగా అవ్వాలి మరియు తయారుచేయాలి.

వరదానము:- శ్రేష్ఠ స్వమానమనే సీటుపై కూర్చుని అందరికీ గౌరవాన్ని ఇచ్చే సర్వుల మాననీయ భవ

సదా మీ శ్రేష్ఠ స్వమానములో స్థితులై, నిర్మానులుగా అయ్యి అందరికీ గౌరవాన్ని ఇస్తూ ఉన్నట్లయితే, ఈ ఇవ్వడమే తీసుకోవడము అవుతుంది. గౌరవాన్ని ఇవ్వడము అనగా ఆ ఆత్మను ఉల్లాస-ఉత్సాహాలలోకి తీసుకువచ్చి ముందుకు పంపించడము. సదా స్వమానంలో ఉన్నట్లయితే సర్వ ప్రాప్తులు స్వతహాగానే ప్రాప్తిస్తాయి. స్వమానం కారణంగా విశ్వము గౌరవాన్ని ఇస్తుంది మరియు సర్వుల ద్వారా శ్రేష్ఠమైన గౌరవము లభించడం వలన మాననీయులుగా అవుతారు.

స్లోగన్:- ఎవరైతే సర్వులకు గౌరవాన్ని ఇస్తారో, వారి రికార్డు స్వతహాగా బాగైపోతుంది.